

సిక్కింలో వెర్టికల్ వీర్ ప్రాంతంలో ప్రమాదానికి గురైన సైనికుల వాహనం

## 800 అడుగుల లోయలో పడ్డ వాహనం.. నలుగురు జవాన్ల దుర్మరణం

న్యూఢిల్లీ : సిక్కింలోని పాక్యోంగ్ జిల్లాలో గురువారం జరిగిన ప్రమాదంలో నలుగురు భారత సైనికులు మరణించారు. పశ్చిమ బెంగాల్‌లోని పెడోంగ్ నుంచి సిక్కింలోని జులూక్‌కు సిల్క్ రూట్ గుండా వెళ్తుండగా వీరు ప్రయాణిస్తున్న వాహనం దాదాపు 800 అడుగుల లోతుగల లోయలో పడిపోయింది. ఈ వాహనం డ్రైవర్ ప్రదీప్ పటేల్, క్రాఫ్ట్స్‌మన్ డబ్ల్యూ పీటర్, నాయక్ గురుసేవ్ సింగ్, సుబేదార్ తంగపండి మరణించినట్లు అధికారులు గుర్తించారు. వీరంతా పశ్చిమ బెంగాల్‌లోని బినగురి యూనిట్‌కు చెందినవారు.

## పిల్లలను 'క్రమశిక్షణ'లో పెట్టేందుకు హక్కు

### టీచర్లకు కల్పిస్తూ చైనా ప్రభుత్వం మార్గదర్శకాలు

*బీజింగ్, సెప్టెంబర్ 5: దేశంలో 2035 నాటికి ఉపాధ్యాయ వృత్తిని గౌరవప్రదమైన, ప్రశంసాపూర్వకమైన వృత్తులలో ఒకదానిగా తీర్చిదిద్దాలని చైనా ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా ఈ వారం చైనా కమ్యూనిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ, స్టేట్ కౌన్సిల్, చైనా క్యాబినెట్ కొన్ని మార్గదర్శకాలను విడుదల చేసింది. విద్యార్థులను 'క్రమశిక్షణ'లో ఉంచేందుకు ఉపాధ్యాయులకు హక్కు కల్పించారు. నిబంధనలు అతిక్రమించిన వారిని, తప్పుడు పనులు చేసిన వారిని ఎంతమాత్రం ఉపేక్షించరు. ఉల్లంఘనులు కఠిన క్రమశిక్షణా చర్యలతో పాటు న్యాయపరమైన విచారణను ఎదుర్కోవాల్సి ఉంటుంది. 1.89 కోట్ల మంది టీచర్లతో చైనా ప్రపంచంలోనే అతి పెద్ద ఉపాధ్యాయ వ్యవస్థ కలిగి ఉంది. అయితే చైనా విద్యా విధానంపై కొన్ని విమర్శలు ఉన్నాయి. క్రమశిక్షణ పేరుతో విద్యార్థులను తరగతి ముగిసిన తర్వాత కూడా నిర్బంధించడం, తరగతులు జరుగుతున్న సమయంలో వారిని నుంచోపెట్టడం వంటి చర్యలను విద్యావంతులు తప్పుబడుతున్నారు.*

## వికీపీడియాని మూసివేయిస్తాం

### ఢిల్లీ హైకోర్టు హెచ్చరిక

న్యూఢిల్లీ: ఢిల్లీ హైకోర్టు గురువారం వికీపీడియాకు కోర్టు ధిక్కార నేరం కింద నోటీసు జారీ చేసింది. ఆసియన్ న్యూస్ ఇంటర్నేషనల్ (ఏఎన్‌ఐ) పిటిషన్‌పై ఈ చర్య తీసుకుంది. ఏఎన్‌ఐ వాదన ప్రకారం, వికీపీడియాలోని ఏఎన్‌ఐ ఎంట్రీ పేజ్‌లో ముగ్గురు వ్యక్తులు ఎడిట్ చేశారు. ఈ మాటలు ఏఎన్‌ఐకి పరువు నష్టం కలిగించే విధంగా ఉన్నాయి. ఈ విధంగా ఎడిట్ చేసిన సబ్‌స్క్రైబర్ల సమాచారాన్ని వెల్లడించాలని హైకోర్టు గతంలో వికీపీడియాను ఆదేశించింది. కానీ వికీపీడియా ఆ ఆదేశాలను పాటించలేదని ఏఎన్‌ఐ మళ్లీ హైకోర్టును ఆశ్రయించింది. దీనిపై విచారణ జరిపిన జస్టిస్ నవీన్ చావ్లా మాట్లాడుతూ, వికీపీడియా భారత దేశపు సంస్థ ఔనా? కాదా? అనేదానితో సంబంధం లేదని చెప్పారు. ''మీ వ్యాపార లావాదేవీలను భారత దేశంలో మూసివేయిస్తాం. వికీపీడియాను బ్లాక్ చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతాం. గతంలో కూడా మీరు ఇదే వాదన వినిపించారు. మీకు భారత్ అంటే ఇష్టం లేకపోతే, దయచేసి, ఇక్కడ పని చేయకండి'' అని హెచ్చరించారు.

# కౌన్ బనేగా సీఎం?

- కర్ణాటక కాంగ్రెస్‌లో ముదురుతున్న కుర్చీలాట
- సీఎం పదవి కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్న డీకే
- రేసులోకి సతీశ్ జార్కిహోళి.. ఢిల్లీలో చర్చలు
- హైకమాండ్ పరిశీలనలో ఖర్గే, పరమేశ్వర పేర్లు
- మంత్రులకు విందు ఇచ్చిన సీఎం సిద్ధరామయ్య
- కుర్చీ కాపాడుకునేందుకు చివరి ప్రయత్నాలు?

బెంగళూరు, సెప్టెంబర్ 5: కర్ణాటక కాంగ్రెస్‌లో కుర్చీలాట ముదురుతున్నది. ముడా, వాల్మీకి కుంభకోణాల ఆరోపణలు ఎదుర్కొంటున్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు పదవీగండం పొంచి ఉంది. బయటకు కాంగ్రెస్ నేతలంతా ఆయనకు మద్దతు ప్రకటిస్తున్నప్పటికీ, సిద్ధరామయ్యను తప్పించాలని అంతర్గతంగా అధిష్ఠానంపై ఒత్తిడి తెస్తున్నట్టు తెలుస్తున్నది. బీజేపీ సైతం సిద్ధరామయ్య రాజీనామా చేయాలని గట్టిగా డిమాండ్ చేస్తున్నది. ఈ నేపథ్యంలో ఆయన కుర్చీ దిగితే వెంటనే అందులో కూర్చునేందుకు కాంగ్రెస్ నేతలు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, హోంమంత్రి జీ పరమేశ్వర, సీనియర్ మంత్రి సతీశ్ జార్కిహోళి సీఎం పదవి కోసం తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు కాంగ్రెస్ అధిష్ఠానం మాత్రం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేరును సైతం పరిశీలిస్తున్నట్టు తెలుస్తున్నది. మరోవైపు సిద్ధరామయ్య తన క్యాబినెట్ మంత్రులకు విందు ఏర్పాటు చేశారు. సీఎం పీఠాన్ని కాపాడుకునేందుకు ఆయన చివరి ప్రయత్నాలు చేస్తున్నారనే ప్రచారం జరుగుతున్నది.

**డీకే ఆశలు నెరవేరేనా?**

గత ఏడాది జరిగిన కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం తర్వాత సిద్ధరామయ్య, పీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ మధ్య సీఎం పదవి కోసం తీవ్ర పోటీ నెలకొన్నది. అధిష్ఠానంతో పాటు మెజారిటీ ఎమ్మెల్యేలు సిద్ధరామయ్య వైపే మొగ్గారు. అయితే, రెండున్నర ఏండ్ల తర్వాత డీకేకు సీఎం పదవి అప్పగించేలా ఒక అనధికార ఒప్పందం జరిగిందనే ప్రచారం ఉంది. ఇప్పుడు సిద్ధరామయ్య దిగిపోతే డీకే సీఎం కావడం ఖాయమని అంతా అనుకున్నారు. అయితే, అనూహ్యంగా రేసులోకి మల్లికార్జున ఖర్గే, సతీశ్ జార్కిహోళి, పరమేశ్వర వంటి నేతలు వచ్చారు. దీనికి తోడు సిద్ధరామయ్య వర్గం డీకేను వ్యతిరేకిస్తున్నది. దీంతో ఈసారైనా సీఎం కావాలనే డీకే ఆశలు నెరవేరుతాయా అనేది ప్రశ్నార్థకంగా మారింది.



**సమీకరణాలు బేరీజు వేస్తున్న హైకమాండ్**

సిద్ధరామయ్యను తర్వాత ఎవరిని ముఖ్యమంత్రిని చేయాలనే అంశంలో కాంగ్రెస్ హైకమాండ్ సామాజికవర్గ సమీకరణాలను బేరీజు వేసుకుంటున్నట్టు తెలుస్తున్నది. బీసీ నాయకుడైన సిద్ధరామయ్యను తప్పిస్తే మరో బీసీ నేతకే అవకాశం ఇవ్వకపోతే బీసీలు దూరం అవుతారనే ఆందోళన హైకమాండ్‌కు ఉన్నట్టు తెలుస్తున్నది. ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకుంటే బీసీ నాయకుడైన జార్కిహోళి పేరును పరిశీలించవచ్చని తెలుస్తున్నది. అధిష్ఠానంతో ఆయన చర్చలు జరుపుతున్నారు. సిద్ధరామయ్య సైతం జార్కిహోళి వైపే మొగ్గు చూపవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే, దళితులకు సీఎం పదవి ఇవ్వాలనే ఆలోచన సైతం కాంగ్రెస్ అధిష్ఠానానికి ఉందని తెలుస్తున్నది. ఈ క్రమంలో ఖర్గే, పరమేశ్వర పేర్లను సైతం పరిశీలిస్తున్నది. ఖర్గేకు సైతం పలువురు ఎమ్మెల్యేల మద్దతు ఉంది. గతంలో సిద్ధరామయ్య, డీకే ఇద్దరే పోటీలో ఉన్నప్పుడే ఏకాభిప్రాయం సాధించేందుకు హైకమాండ్ నానా తంటాలు పడింది. ఈసారి నలుగురు పోటీలో ఉండటంతో సీఎం ఎంపిక నిర్ణయం కర్ణాటక కాంగ్రెస్‌లో సంక్షోభానికి దారితీసే అవకాశాలు లేకపోలేదని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

### ఎదురుదాడికి 'సిద్ధ'ం

ముడా, వాల్మీకి, ఖర్గే ట్రస్టు వంటి కుంభకోణాలను తెరపైకి తెస్తూ తనను ఇబ్బంది పెడుతున్న బీజేపీపై ఎదురుదాడికి దిగాలని సిద్ధరామయ్య భావిస్తున్నారు. ఇందులోభాగంగా గత బీజేపీ ప్రభుత్వం చేసిన అక్రమాలు, పాత ఆరోపణలను తవ్వితీయాలని నిర్ణయించారు. కొవిడ్ నిర్వహణకు సంబంధించి రూ.7,200 కోట్ల అక్రమాలు జరిగాయనే ఆరోపణలపై జస్టిస్ జాన్ మైఖేల్ డిసన్హ కమిషన్ ఇచ్చిన మధ్యంతర నివేదిక, ఎస్సై నియామక అక్రమాలపై జస్టిస్ బీ వీరప్ప కమిషన్ ఇచ్చిన నివేదికలను బయటకు తీయాలని సిద్ధరామయ్య భావిస్తున్నారు. తద్వారా తనపై వస్తున్న ఆరోపణల తీవ్రతను తగ్గించేందుకు ప్రయత్నించనున్నట్టు సమాచారం.

### మంత్రులకు సిద్ధరామయ్య విందు

ముడా కుంభకోణం, పదవీగండం నేపథ్యంలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తన క్యాబినెట్ మంత్రులకు ఇటీవల విందు ఏర్పాటు చేసినట్టు తెలుస్తున్నది. ముఖ్యమంత్రి పదవిని కాపాడుకునేందుకు ఆయన చివరి ప్రయత్నాలు చేస్తున్నట్టు సమాచారం. ఈ మేరకు మంత్రులతో చర్చలు జరిపినట్టు ప్రచారం జరుగుతున్నది. తాజాగా సిద్ధరామయ్య చేసిన వ్యాఖ్యలు సైతం ఆసక్తికరంగా మారాయి. 'వెన్నుపోటుదారులు ఎప్పుడూ ఉంటారు. అయితే, ప్రజల ఆశీస్సులు ఉన్నంత కాలం నన్ను ఎవరూ కదపలేరు' అని ఆయన వ్యాఖ్యానించడం పార్టీలో జరుగుతున్న పరిణామాలను సూచిస్తున్నది.

## కమలా హ్యారిసే గెలుస్తారు!

### యూఎస్ నోస్ట్రాడామస్ జోస్యం

న్యూయార్క్, సెప్టెంబర్ 5: అమెరికా అధ్యక్ష ఎన్నికల నోస్ట్రాడామస్‌గా పేరొందిన ఎన్నికల విశ్లేషకుడు అలన్ లిచట్మన్ ఈ సారి అమెరికా అధ్యక్ష ఎన్నికల విజేత ఎవరో ప్రకటించారు. డెమొక్రటిక్ అభ్యర్థి కమలా హారిసే వైట్‌హౌస్ పీఠాన్ని దక్కించుకుంటారంటూ ఆయన జోస్యం చెప్పారు. 'అగ్రరాజ్య కాబోయే అధ్యక్షురాలు హారిస్' అంటూ వీడియోలో పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో రిపబ్లికన్ అభ్యర్థిగా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, డెమొక్రటిక్ పార్టీ నుంచి కమలా హ్యారిస్ పోటీలో ఉన్నారు. కాగా 'కీస్ టు వైట్ హౌస్' విధానంలో అధ్యక్షుడు ఎవరో గత 40 ఏండ్లుగా ఆయన కచ్చితంగా జోస్యం చెబుతూ వస్తున్నారు.

## అగ్నివీర్ పథకంలో మార్పులు!

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 5: విమర్శలు, వివాదాలకు దారితీసిన 'అగ్నివీర్ పథకం'పై మోదీ సర్కార్ దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించింది. అర్హతలు, పారితోషకాలతోపాటు, మరికొంత మంది అగ్నివీర్లను సర్వీస్‌లో కొనసాగించేలామార్పులు ఉండబోతున్నాయని రక్షణశాఖ వర్గాలు వెల్లడించాయి. పథకం మరింత మెరుగుకు అవసరమైన సవరణలు చేస్తామని ఉన్నతాధికారులు చెబుతున్నారు. '25శాతం మందికి ఫుల్‌టైమ్ సర్వీస్ ఇవ్వటం.. క్షేత్రస్థాయిలో ఉన్న డిమాండ్‌కు సరిపోదు. నాలుగేండ్ల శిక్షణ తర్వాత అగ్నివీర్లలో 50శాతం మందిని ఫుల్‌టైమ్ సర్వీస్‌కు ఎంపిక చేయాలని సైన్యం సిఫారసు చేసింది' అని రక్షణ శాఖ తెలిపింది. వివిధ వర్గాల నుంచి అభిప్రాయాలు తీసుకున్న తర్వాత సైన్యం తన సిఫారసులను అందజేసినట్టు తెలిసింది.

## పోలీసులు లంచం ఇవ్వజూపారు!

### కోల్‌కతా హత్యాచార ఘటనపై వైద్యురాలి తల్లిదండ్రుల ఆరోపణ

కోల్‌కతా, సెప్టెంబర్ 5: కోల్‌కతా హత్యాచార ఘటనలో వైద్యురాలి తల్లిదండ్రులు తాజాగా సంచలన ఆరోపణలు చేశారు. కేసును నీరుగార్చేందుకు ప్రయత్నించారని మండిపడ్డారు. ఇందుకోసం తమకు డబ్బులు ఇచ్చే ప్రయత్నం చేశారని తాజాగా వెల్లడించారు. వైద్యురాలి హత్యాచారాన్ని నిరసిస్తూ బుధవారం రాత్రి కోల్‌కతా ఆర్‌జీ కర్ దవాఖాన వద్ద నిరసన కార్యక్రమం జరిగింది. వేల సంఖ్యలో జనం క్యాండిల్స్‌తో వైద్యురాలి మృతికి నివాళి అర్పించారు. మరోవైపు, ట్రైనీ డాక్టర్ హత్యాచారం జరిగిన మర్నాడే అప్పటి ప్రిన్సిపాల్ సందీప్ ఘోష్ కీలక ఆదేశాలు జారీ చేసినట్లు బయటపడింది. ఆగస్టు 9న డాక్టర్‌పై దారుణం జరగగా, ఆగస్టు 10న ఘోష్ పీడబ్ల్యూడీకి ఓ లేఖ రాశారు. అన్ని డిపార్ట్‌మెంట్లలోని ఆన్ డ్యూటీ డాక్టర్ల గదుల్లో మరమ్మతులు, ఆధునికీకరణ, పునర్నిర్మాణ పనులను చేయాలని కోరారు.

## ప్రైమరీ స్కూల్ టీచర్ పోస్టుకు బీఈడీ అర్హత కాదు: సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ : ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయ ఉద్యోగానికి బీఈడీ డిగ్రీ సరైన అర్హత కాదని సుప్రీంకోర్టు పునరుద్ఘాటించింది. ప్రాథమిక విద్యలో డిప్లొమా ఉండటం ఈ ఉద్యోగానికి సరైన అర్హత అని చెప్పింది. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులుగా బీఈడీ డిగ్రీ హోల్డర్ల నియామకాలను రద్దు చేస్తూ ఛత్తీస్‌గఢ్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ఈ ఉద్యోగానికి బీఈడీ హోల్డర్స్ అర్హులని చెప్తూ చేర్చిన నిబంధనను అమలు చేయరాదని స్పష్టం చేసింది. బీఈడీ హోల్డర్స్‌కు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయ ఉద్యోగాలు ఇవ్వడం చట్టవిరుద్ధమని, ఛత్తీస్‌గఢ్ హైకోర్టు ఈ నియామకాలను రద్దు చేయడం సరైనదేనని వివరించింది.

## వాయు కాలుష్యంతో పురుషుల్లో వంధ్యత్వం

న్యూఢిల్లీ: దీర్ఘకాలికంగా వాయుకాలుష్యం బారినపడిన పురుషుల్లో సంతాన లేమి వేధిస్తుందని తాజా అధ్యయనం తేల్చింది. 5,26,056 మంది పురుషులపై డెన్మార్క్‌లోని నార్డ్ యూనివర్సిటీ ఈ అధ్యయనం చేపట్టింది.

## కేజ్రీవాల్ బెయిల్ పిటిషన్‌పై తీర్పు వాయిదా

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 5: మద్యం పాలసీ కేసులో బెయిల్ కోసం ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ మరికొంత కాలం నిరీక్షించక తప్పేట్టు లేదు. సీబీఐ అరెస్టును సవాల్ చేస్తూ, బెయిల్ కోరుతూ ఆయన దాఖలు చేసిన పిటిషన్లపై సుప్రీంకోర్టు తీర్పును వాయిదా వేసింది. గురువారం ఈ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. ఈడీ కేసులో జ్యుడిషియల్ కస్టడీలో ఉన్న కేజ్రీవాల్‌ను సీబీఐ అరెస్టు చేయటాన్ని తప్పుబట్టింది. కోర్టు అనుమతి తీసుకోవాలి కదా.. అంటూ సీబీఐని మందలించింది. కేజ్రీవాల్ పిటిషన్లపై సెప్టెంబర్ 10న సుప్రీంకోర్టు తీర్పు వెలువరించే అవకాశముంది! సీబీఐ కేజ్రీవాల్‌ను అరెస్టు చేసింది. అరెస్టును ఢిల్లీ హైకోర్టు సమర్థించగా, ఆయన సుప్రీంను ఆశ్రయించారు.

## కోటాలో మరో నీట్ విద్యార్థి ఆత్మహత్య

కోటా: రాజస్థాన్‌లోని కోటాలో మరో నీట్ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. యూపీలోని మథుర జిల్లా బార్సనాకు చెందిన పరశురామ్ (21) బుధవారం తాను ఉంటున్న రూమ్‌లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్టు జవహర్ నగర్ పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా పరశురామ్ తండ్రి మాట్లాడుతూ తన కుమారుడు మూడేండ్లుగా నీట్ కోసం కోటాలో శిక్షణ తీసుకుంటున్నాడన్నారు. గత ఏడాది పరీక్షలో 647 మార్కులు సాధించాడని, అయితే నీట్ వివాదం కారణంగా మనస్తాపం చెందాడని చెప్పారు.

## నడిరోడ్డుపై లైంగిక దాడి

### మధ్యప్రదేశ్‌లో దారుణం

భోపాల్: మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిన్‌లో దారుణం జరిగింది. ఓ మహిళకు మద్యం తాగించి నడిరోడ్డుపై లైంగిక దాడికి పాల్పడ్డాడు ఒక వ్యక్తి. బుధవారం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నిందితుడు బాధిత మహిళను వివాహం చేసుకుంటానని నమ్మించి అత్యాచారానికి పాల్పడ్డాడని పోలీసులు తెలిపారు. లైంగిక దాడి తర్వాత ఈ విషయం బయటకు చెప్తే చంపేస్తానని బాధితురాలిని బెదిరించి నిందితుడు పారిపోయాడు. కాగా, ఈ ఘటనకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారడంతో పోలీసులు స్పందించి అతడిని అరెస్టు చేశారు.



## పిల్లల మృతదేహాల్ని భుజాలపై మోసుకుంటూ..

### 15 కిలోమీటర్లు నడిచిన తల్లిదండ్రులు.. • మహారాష్ట్రలో ఘటన

ముంబై, సెప్టెంబర్ 5: పదేండ్ల లోపు ఇద్దరు మగ పిల్లలు. అనారోగ్యంతో దవాఖానలో చనిపోగా.. పుట్టెడు శోకంలో ఉన్న ఆ పిల్లల తల్లిదండ్రుల గోడు పట్టించుకునే నాథుడే లేడు. దవాఖాన సిబ్బంది కనీసం అంబులెన్స్ కూడా ఏర్పాటుచేయకపోవటంతో, పిల్లల మృతదేహాల్ని వారి తల్లిదండ్రులు భుజాలపై మోసుకెళ్లారు. గడ్చిరోలి నుంచి 15 కిలోమీటర్ల దూరంలోని పట్టిగావో గ్రామానికి వారు నడుచుకుంటూ వెళ్తున్న వీడియో ఒకటి వెలుగులోకి వచ్చింది. డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ ఇంచార్జ్ మంత్రిగా ఉన్న గడ్చిరోలిలో ఈ ఘటన చోటుచేసుకుందని విపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి.

## శాంతి చర్చలకు పుతిన్ పచ్చజెండా

### భారత్ సహా మూడు దేశాలు మధ్యవర్తిత్వం చేయగలవని వెల్లడి

*మాస్కో, సెప్టెంబర్ 5: ఉక్రెయిన్‌తో రెండేళ్లకు పైగా యుద్ధం సాగిస్తున్న రష్యా తాజాగా శాంతి చర్చలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఉక్రెయిన్ సంక్షోభంపై తాము భారత్ సహా చైనా, బ్రెజిల్ దేశాలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్టు ఆ దేశ అధ్యక్షుడు పుతిన్ గురువారం తెలిపారు. ఈ మూడు దేశాలు ఈ సంక్షోభ నివారణకు చిత్తశుద్ధితో ప్రయత్నాలు చేస్తున్నాయని, మాస్కో-కీవ్ మధ్య శాంతియుత చర్చలకు అవి మధ్యవర్తిత్వం వహించగలవని పుతిన్ తాజా ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. వ్లాడివస్టోక్‌లో జరిగిన ఈస్టర్న్ ఎకనమిక్ ఫోరమ్ (ఈఈఎఫ్) ప్లీనరీ సెషన్‌కు హాజరైన ఆయన మాట్లాడుతూ 'ప్రస్తుత సంక్షోభంపై చర్చలు జరపాలని ఒకవేళ ఉక్రెయిన్ కోరుకుంటే దానికి నేను సిద్ధమే' అని శాంతి చర్చలకు తన సమ్మతి తెలిపారు. కాగా, రెండు వారాల క్రితం భారత ప్రధాని నరేంద్ర మోదీ ఉక్రెయిన్‌లో పర్యటించి ఆ దేశ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో చర్చలు జరిపిన అనంతరం పుతిన్ ఈ వ్యాఖ్యలు చేశారు.*

## అప్పటిదాకా సైలెంట్‌గా ఉంటే మంచిది!

### హసీనాకు బంగ్లా తాత్కాలిక ప్రభుత్వ చీఫ్ యూనస్ హెచ్చరిక

ఢాకా: హింస ప్రజ్వరిల్లడంతో దేశం నుంచి పారిపోయి భారత్‌లో తలదాచుకున్న బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాపై ఆ దేశ తాత్కాలిక ప్రభుత్వ చీఫ్ మహమ్మద్ యూనస్ హెచ్చరికలు జారీ చేశారు. దేశం నుంచి పారిపోయి ఇక్కడ తలదాచుకుంటూ ప్రకటనలు చేయడం పట్ల మండిపడ్డారు. భారత్ నుంచి ఆమె రాజకీయ వ్యాఖ్యలు చేయడం ఎంతమాత్రం సమర్థనీయం కాదని, అది ఇరు దేశాలకు ఇబ్బంది కలిగిస్తుందని అన్నారు. ఆమెను తమకు అప్పగించాలని భారత్‌ను ఢాకా కోరేవరకు ఆమె మౌనంగా ఉండాలని హెచ్చరించారు. ఆయన పీటీఐకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలను ప్రస్తావించారు.

**భారత్ ఆ ఆలోచనను విడనాడాలి**

బంగ్లాలోని అవామీ లీగ్ పార్టీ తప్ప మిగతావన్నీ ఇస్లామిస్ట్ పార్టీలని, హసీనా లేకపోతే బంగ్లా మరో అఫ్గానిస్థాన్‌లా మారిపోతుందన్న ఆలోచనను భారత్ విడనాడాలని యూనస్ అన్నారు. హసీనా భారత్‌లో ఆశ్రయం పొందడంతో ఏ ఒక్కరూ సౌకర్యంగా లేరని, అందుకే తాము ఆమెను భారత్ నుంచి రప్పించడానికి ప్రయత్నిస్తున్నట్టు చెప్పారు.

## రైతులకు త్వరలో డిజిటల్ ఐడీలు

- ఆధార్ తరహాలో జారీ చేయనున్న కేంద్రం
- మూడేండ్లలో 11 కోట్ల మందికి మంజూరు



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 5: దేశంలోని 11 కోట్ల మంది రైతులకు ఆధార్ తరహాలో డిజిటల్ ఐడీలు జారీచేయాలని కేంద్రం నిర్ణయించింది. రైతులను సాధికారులను చేసేందుకు వచ్చే మూడు ఆర్థిక సంవత్సరాలలో ఈ కార్డులను జారీచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నది. అగ్రిస్టాక్ కార్యక్రమంలో భాగంగా రైతులకు అందజేసే సేవలు, పథకాలను క్రమబద్ధం చేసేందుకు డిజిటల్ ఐడీలను ఇవ్వనున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆరు కోట్ల మందికి, వచ్చే ఆర్థిక సంవత్సరం మూడు కోట్ల మందికి, ఆ తరువాత ఏడాది రెండు కోట్లమందికి డిజిటల్ ఐడీలను జారీచేయనున్నట్టు ప్రభుత్వం తెలిపింది. రాష్ట్రప్రభుత్వాలు/కేంద్రపాలిత ప్రాంతాలు ఈ ఐడీలను సృష్టించి, నిర్వహిస్తాయని పేర్కొంది. రైతుల భూమి రికార్డులు, వారి పశు సంపద, పంటల సాగు, వారికి లభించే సదుపాయాలకు ఐడీలను అనుసంధానం చేస్తారని వివరించింది. త్వరలో దేశవ్యాప్తంగా పంటల సర్వేను ప్రారంభించనున్నట్టు ప్రభుత్వం తెలిపింది. ఈ ఆర్థిక సంవత్సరంలో 400 జిల్లాల్లో, వచ్చే ఆర్థిక సంవత్సరంలో మిగిలిన జిల్లాల్లో డిజిటల్ సర్వే పూర్తిచేస్తామని పేర్కొంది.

## ఇక 'ఇండియా' సైజ్‌లో దుస్తులు

### త్వరలో మన శరీరాలకు తగ్గట్టు ప్రామాణిక కొలతల రూపకల్పన

- యూఎస్, యూకే సైజ్‌లకు చెల్లు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 5: భారత్‌లో త్వరలోనే 'ఇండియాసైజ్'లో దుస్తులు లభించనున్నాయి. ఇందుకోసం కేంద్ర టెక్స్‌టైల్స్ శాఖ కొత్త ప్రాజెక్టును చేపట్టనుంది. ఈ విషయాన్ని గురువారం ఢిల్లీలో కేంద్రమంత్రి గిరిరాజ్ సింగ్ ప్రకటించారు. ఇప్పటివరకు భారత్‌లో దుస్తులు అన్నీ యూఎస్ లేదా యూకే సైజ్‌లలోనే లభిస్తున్నాయి. అక్కడి ప్రజల శరీరాలను ప్రామాణికంగా తీసుకొని రూపొందించిన కొలతలు ఇవి. ఈ దుస్తులు భారతీయులు ధరించేటప్పుడు కొన్నిసార్లు సరిగ్గా సరిపోవు. పాశ్చాత్యుల శరీర కొలతలు భారతీయులతో పోలిస్తే కొంత భిన్నంగా ఉండటమే ఇందుకు కారణం. ఈ సమస్యకు 'ఇండియా సైజ్' ప్రాజెక్టు పరిష్కారం చూపిస్తుందని కేంద్రమంత్రి గిరిరాజ్ సింగ్ తెలిపారు. భారతీయుల శరీరాలకు తగ్గట్టుగా కొత్త ప్రామాణిక కొలతలను రూపొందించనున్నట్టు ఆయన చెప్పారు. కాగా,దుస్తుల డిజైన్‌ల తయారీ కోసం టెక్స్‌టైల్స్ శాఖ, ఎన్‌ఐఎఫ్‌టీ కలిసి రూపొందించిన ఏఐ ఆధారిత 'విజన్‌నెక్ట్స్' పోర్టల్‌ను గురువారం గిరిరాజ్ సింగ్ ప్రారంభించారు.

## సంక్షోభంలో ట్రూడో సర్కారు


న్యూఢిల్లీ: కెనడాలో జస్టిన్ ట్రూడో సర్కారు సంక్షోభంలో చిక్కుకున్నది. సిక్కు నేత జగ్మీత్ సింగ్ నేతృత్వంలోని న్యూ డెమొక్రాటిక్ పార్టీ (ఎన్‌డీపీ) ట్రూడో నేతృత్వంలోని లిబరల్ గవర్నమెంట్‌కు మద్దతు ఉపసంహరించుకోవడంతో రాజకీయ సంక్షోభం ఏర్పడింది. వచ్చే ఏడాది అక్టోబరులో జరిగే ఎన్నికల వరకు ట్రూడో నిలకడగా పరిపాలన చేయగలరా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కెనడియన్లపై ప్రభావం చూపుతున్న సమస్యలను పరిష్కరించడంలో ట్రూడో ప్రభుత్వం విఫలమైందని జగ్మీత్‌సింగ్ విమర్శించారు. కార్పొరేట్ దురాశపరులకు లొంగిపోతున్నారని, ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని దుయ్యబట్టారు.



## రోబోలూ అబద్ధాలు ఆడతాయి!

*న్యూఢిల్లీ: రోబోలు అబద్ధాలు ఆడగలవట. మనల్ని మోసం కూడా చేయగలవట. మనిషి మనుగడకే సవాల్ విసురుతున్న తాజా అధ్యయన వివరాలను అమెరికాకు చెందిన జార్జ్ మాసన్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు వెల్లడించారు. కృత్రిమ మేధస్సు మరింత వృద్ధి చెందుతున్న తరుణంలో రోబోలు మనిషిలా ప్రవర్తిస్తాయని తెలిపారు. ప్రస్తుతం చాట్‌బాట్స్ కొన్ని సందర్భాల్లో మనిషిని తప్పుదోవ పట్టిస్తున్నాయని ఉదహరిస్తున్నారు. ఇలాంటి మోసపూరిత కార్యకలాపాల నుంచి మనం కాపాడుకోవాల్సిన ఆవశ్యకతను నొక్కిచెప్పారు.*

## 45 నిమిషాల్లోనే డీఎన్‌ఏ టెస్టు



*న్యూయార్క్, సెప్టెంబర్ 5: లైంగిక దాడి కేసుల విచారణలో కీలకమైన డీఎన్‌ఏ పరీక్షను కేవలం 45 నిమిషాల్లోనే జరిపే కొత్త ఫోరెన్సిక్ సాంకేతికతను పరిశోధకులు అభివృద్ధి చేశారు. దీని ద్వారా అధునాతన ల్యాబ్ సదుపాయం అవసరం లేకుండానే డీఎన్‌ఏ పరీక్షను చేయవచ్చని పరిశోధక బృందంలో ఒకరైన మహమ్మద్ ఎల్సాయెద్ తెలిపారు. లైంగిక దాడి జరిగినప్పుడు నిందితులను గుర్తించేందుకు, నేరం రుజువు చేసేందుకు డీఎన్‌ఏ పరీక్ష కీలకమైన ఆధారంగా ఉంటుంది. ఇందుకోసం ముందు బాధితుల శరీరం నుంచి డీఎన్‌ఏ నమూనాలను సేకరించి, ల్యాబ్‌కు పంపిస్తారు. ల్యాబ్‌లో నిపుణులు చాలా క్లిష్టమైన ప్రక్రియ ద్వారా బాధితుల, ముద్దాయి డీఎన్‌ఏ నమూనాలను వేరు చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత ముద్దాయి డీఎన్‌ఏను విశ్లేషించే వీలు ఉంటుంది. ఈ ప్రక్రియకు కొన్ని రోజుల సమయం పడుతుంది. తాము అభివృద్ధి చేసిన కొత్త సాంకేతికతతో కేవలం 45 నిమిషాల్లోనే డీఎన్‌ఏ నమూనాలను వేరు చేసి, పరీక్షించే వీలు ఉంటుందని మహమ్మద్ ఎల్సాయెద్ తెలిపారు. సేకరించిన శాంపిల్ నుంచి ఇద్దరు వ్యక్తుల డీఎన్‌ఏను తమ కొత్త సాంకేతికత ద్వారా డిజిటల్ మైక్రోఫ్లూయిడిక్స్‌ను ఉపయోగించి వేగంగా వేరు చేయవచ్చని చెప్పారు. ఇందుకు అధునాతన ల్యాబ్ అవసరం కూడా లేదని తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలు 'అడ్వాన్స్‌డ్ సైన్స్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.*



## ఆపద వస్తే వయసు రివర్స్!

*న్యూయార్క్: మనుషుల వయసును రివర్స్ చేయడానికి అనేక పరిశోధనలు జరుగుతున్నా ఫలితం మాత్రం శూన్యం. కానీ, ఓ సముద్ర జీవికి మాత్రం వయసును రివర్స్ చేసుకునే లక్షణాన్ని ప్రకృతే ఇచ్చినట్టు పరిశోధకులు గుర్తించారు. అట్లాంటిక్ కోంబ్ జెల్లీ సముద్ర జీవిలో ఈ అరుదైన లక్షణం ఉన్నట్టు తేల్చారు. దీనిని 'సీ వాల్నట్' అని కూడా పిలుస్తారు. గాయపడినప్పుడు, ఆహారం లభించడం కష్టమై ప్రాణానికే ముప్పు వాటిల్లినప్పుడు ఇవి వాటి శరీరాన్ని లార్వా దశకు మార్చగలవని పరిశోధకులు గుర్తించారు.*

## ప్రపంచంలోనే తొలి న్యూక్లియర్ క్లాక్

- అభివృద్ధి చేసిన అమెరికన్ శాస్త్రవేత్తలు
- ఇక మరింత కచ్చితత్వంతో సమయం



న్యూయార్క్, సెప్టెంబర్ 5: ప్రపంచంలోనే తొలి న్యూక్లియర్ క్లాక్‌ను అమెరికాకు చెందిన శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. ఈ గడియారం ద్వారా అత్యంత కచ్చితత్వంతో సమయాన్ని గుర్తించవచ్చు. అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ కొలరాడో బౌల్డర్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్టాండర్డ్స్ అండ్ టెక్నాలజీకి చెందిన శాస్త్రవేత్తలు కలిసి అభివృద్ధి చేసిన ఈ గడియారానికి సంబంధించిన వివరాలు 'నేచర్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. పరమాణువు కేంద్రకం నుంచి వచ్చే సిగ్నల్స్ ద్వారా ఈ గడియారం పని చేస్తుంది. అధికారికంగా అంతర్జాతీయ సమయాన్ని చెప్పే ప్రస్తుత అటామిక్ గడియారాల కంటే ఈ న్యూక్లియర్ గడియారం మరింత కచ్చితత్వంతో సమయాన్ని చెప్తుంది. భవిష్యత్తులో అటామిక్ గడియారాలను న్యూక్లియర్ గడియారాలు భర్తీ చేసే అవకాశాలు ఉన్నాయని శాస్త్రవేత్తలు చెప్తున్నారు. జీపీఎస్ వ్యవస్థలు మరింత కచ్చితత్వంతో పని చేయడానికి, ఇంటర్నెట్ వేగం పెరగడానికి, డిజిటల్ సమాచార వ్యవస్థల భద్రతకు, శాస్త్ర పరిశోధనలకు ఈ గడియారం కీలకంగా మారబోతున్నదని తెలిపారు.